# ఆశాకిరణాలు

ఉషోదయమైనది, బాలభానుని బంగారు కిరణరాగంలో మునిగి తేల్తూన్న జగం విధ్యుక్త ధర్మనిర్వహణ కుపక్రమించింది. ఆలయాలలో ఘంటానినాదాలు అంతకంతకు అధికతరమౌతున్నాయి.

భీష్మైకాదశి—పర్వదినం కావటంవలన విష్ణుమూర్తి ఆలయంలో జనసమ్మర్దాని కెక్కడా అంతులేకుండా వుంది. అతిప్రయాసతో దైవదర్శనం కావించుకుని బయటపడిన రుక్మిణీదేవి గృహోన్ముఖియైనది. దైవదర్శనంవలన చిత్తం ఉల్లాసప్రపూర్ణమైనది. ఆమె గృహప్రాంగణంలో ప్రవేశించగానే పూలుకోస్తూన్న ఆశాలత త్వరితంగా మందారం చాటుకు తప్పుకుంది. కొద్దినిముషాలకు పూర్వమే దైవదర్శనంతో నిర్మలత్వం పొందిన రుక్మిణి వదనం విచార 'మేఘాచ్ఛాదితమై ధరణి కభిముఖమైంది. త్వరత్వరగా యింట్లో ప్రవేశించింది. హాల్లో చదువుకుంటూన్న ఉషారాణి పుస్తకం విడచి, తల్లి దగ్గరకు పరుగెట్టుకొచ్చి నవ్వుతూ చెయ్యి చాపింది. ఆలయంనుండి తెచ్చిన ప్రసాదం ఆమెకిస్తూ "అక్కయ్యకు కూడా యియ్యి." అంటూ పూజ గదివైపు

నడచింది రుక్మిణీదేవి. ఆమె కనుకొలకులలో అతి ప్రయాసతో అదిమిపట్టిన అశ్రుబిందువులను ఉష చూడలేకపోలేదు. తల్లి దెస చూచి దీర్ఘంగా విశ్వసిస్తూ అక్కా! నన్నేపింప బయల్దేరింది.

అప్పుడే గడపదాటి లోనికి వస్తూన్న ఆశ చెల్లెలికి పూజసెజ్జ అందించి "అమ్మ కిచ్చావురా" అంది మెల్లగా. ఉష యిచ్చిన అరటిపండును కళ్ళకద్దుకుని భుజించి, వంట గదివైపు నడచింది. ఉష తిరిగివచ్చి అక్కదగ్గర కూర్చుంది.

అక్కయిచ్చిన కాఫీ త్రాగుతూ అడిగింది. పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి. చదవవలసినది చాలా వుంది, చీకటితోనే నువ్వు లేచినప్పుడు లేపమన్నానుగా అక్కా? మర్చిపోయావా?"

"లేదమ్మా. ఊరికేనే, రాత్రి ప్రొద్దుపోయేవరకు చదువుతూనే వున్నావుకదా అని."

"సాయంత్రం సినిమా కెళ్దామా అక్కా?" ఉష అడిగింది. ఆశ నిత్య విచారవదనం ఉష హృదయంలో కంటకప్రాయంగా వుంటుంది. అక్కను వీలైనంతవరకూ శోకదూరం చేయాలన్నదే ఆమె తాపత్రయం.

"ఏం సినిమా"! అనడిగింది ఆశ చిరుదరహాసంతో.

"ఏదో ఒకటి. మంచివి చాలా వున్నాయి."

"రేపు వెళ్దాంకానీ, అమ్మ నీతో ఏమీ చెప్పవేదా"

"ఏమిటి?"

"ఇవ్వాళ ఈ ఉషారాణిని వరించడానికి కిరణ్‌కుమార్ గారు వేంచేస్తున్నారట!" అంది హాస్యంగా.

ఉష మాట్లాడలేదు.

"అందుకే ప్రొద్దున్న నిద్ర లేపలేదు ఉషా. లేవగానే నాముఖం చూపడ మెందుకని" అంది ఆశ బరువుగా.

ఉష గిజగిజలాడిపోయింది. "అలా ఎప్పుడూ అనుకోకు అక్కా, నాకు నువ్వు అందరికంటె ఎక్కువ. నా దృష్టిలో నువ్వు దేవతవు" కళ్ళు తుడుచుకుంది.

"ఉషా, ఇవ్వాళ ఎవరో పెళ్ళికొడుకు వస్తున్నాడట. నువ్వు కాలేజీకి సెలవుపెట్టు" అంటూ రుక్మిణి ప్రవేశించింది.

ఉష నేలచూపులు చూస్తూ ఊరుకుంది.

"అయ్యో, పలుకే బంగారం, అలా మాట్లాడవేమే రెట్టించింది తల్లి.

"ఏం లేదు కాని, నా కటువంటి కోరిక లేదమ్మా. మీరు ఆ ప్రయత్నాలు చేస్తున్నారని తెలిస్తే ముందుగానే చెప్పివుందును" అక్కడినుంచి పోబోయింది.

"వెళ్ళిపోకు. ఈ కాఫీ కాస్త నాన్నగారి కిచ్చివెళ్లు" అంది వెనకనుంచి ఆశ.

కాఫీగ్లాసుతో ఉష నిష్క్రమించింది.

"అలాగంటుందేమిటే? మనమా పెద్ద కట్న కానుకలు ఇచ్చుకోలేం, వాళ్ళంతవాళ్ళు దయదలచి వచ్చిన సంబంధం కాదంటే ఎలా?" అంది రుక్మిణి దిగులుగా పెద్దకుమార్తెతో.

ఆశ నిండుగా నవ్వింది. "సిగ్గుపడుతున్నదేమో? అంత మాత్రానికే కంగారెందుకమ్మా? నేను నచ్చచెప్తానులే."

కాఫీ ఇచ్చి వెళ్ళిపోతున్న ఉషారాణిని తండ్రి వెనుకకు పిల్చాడు. "చూడమ్మా, ఇవ్వాళ కాలేజీకి సెలవుపెట్టి ఇంటిలో ఉండు."

ఉష మౌనంగా బొటనవ్రేలితో నేలరాస్తూ నిల్చుంది.

తిరిగి శేషగిరిరావు చెప్పాడు. "ఇవ్వాళ మీ మామయ్య తన స్నేహితుడొకాయనను వెంటబెట్టుకొస్తున్నాడట. చాలా మంచిభావాలు కలవాడట. కట్నకానుకల ఆశ లేదట. మామయ్య పనిచేస్తూన్న కాలేజీలోనే లెక్చరరట. ఇంతకూ పెళ్ళిచూపుల బెడద ఏమీ వుండదు. అతడందుకోసం రావడంలేదు; ఇద్దరూ సరదాగా నాలుగూళ్ళు తిరిగి వెళ్తారట. ఊరికేనే ఇక్కడ నాల్గురోజులుండి వెళ్తామని వ్రాశాడు మామయ్య."

అప్పటికీ మాట్లాడలేదు ఉష.

"మాట్లాడవేం ఉషా?" అడిగాడు శేషగిరిరావు.

"అక్కను చూస్తోంటే నాకా ఆశకలుగదు నాన్నా" అంది సజల నేత్రాలను పైకెత్తి.

"అందరూ అలాంటి దురదృష్టవంతులే వుంటారామ్మా? ఎవరి జీవితం వారిది" కళ్ళజోడు తీసి కళ్ళు తుడుచుకున్నాడు.

"ఇక అక్క బ్రతుకు అంతేనా నాన్నా? నా గురించి ఆలోచిస్తున్నారు?" ఈసారి అశ్రుప్రవాహాన్నాపడం ఆమె తరం గాకపోయింది.

శేషగిరిరావు ముఖంలో కఠినత్వం ప్రవేశించింది. "శుభమా అని నీ పెళ్ళి తలపెడ్తూంటే ఆ దౌర్భాగ్యురాలి గోలెందుకు నీకు? అపశకునం. అయినా నా బాధ్యత లేవో నాకు తెలియవా? నీ కంటె పెద్దదాన్ని గురించిన చింత నీ కెందుకు? వెళ్లు లోపలికి. ఇంటిదగ్గరే వుండు. వాళ్లు మెయిల్లో వస్తారు."

కనులు వొత్తుకుంటూ ఆ చండశాసనం అమలుజరుప డానికి లోపలికి వెళ్ళిపోయింది ఉషారాణి.

"ఉషా!" అక్క తియ్యని పిలుపువిని జడవేసుకుం టున్న ఉష వెనుదిరిగింది. చామంతుల మాలతో వచ్చింది ఆశాలత. చెల్లెలి కురులలో ఆ విరులు ముడుస్తూ "అలాగు న్నావేం ఉషా?" అంది అనునయంగా.

బరువుగా నిట్టూర్చింది ఉషారాణి. "నేనివ్వాళే ఇలా వున్నాను. కాని నువ్వు నిత్యం—అనుదినం, అనుక్షణం—అలాగే వుంటావుగా అక్కయ్యా!"

ఆశ విచారవదనం మరింత విచారపూరితమైంది.

"నేనందుకే పుట్టాను ఉషా? నాతో నీకు పోలికేమిటి? నీ జీవితమంతా ముందేవున్నది."

లేదక్కా. నాకూ నీకూ తేడాఏమిటి? ఎప్పుడో ఏదో జరిగితే అందుకు నీ తప్పేముంది? వృద్ధుల మూర్ఖవాదనలు విని నువ్వుకూడా మూర్ఖంగా ఆలోచించకు.

"ఉషా!"

"అక్కయ్యా!" ఒకరి నొకరు కౌగలించుకు బావురు మన్నారు. అలా ఎంతసేపు ఉన్నారో మరి—తల్లి కేక విని ఈ లోకంలో పడ్డారు.

"మెయిల్ టయిమయ్యిందే అమ్మాయ్" హెచ్చరించింది రుక్మిణి.

"ఆఁ, ఆఁ. సిద్ధమేనమ్మా!" దివాబిచ్చింది ఆశ. చెల్లెలి వైపు తిరుగుతూ" చూడు ఉషా, ఏదెలా జరగాలో అలా జరుగుతుంది. మనిం విచారించి లాభంలేదు, నువ్వు అనవసర బెంగపెట్టుకోకు మోడువారిన నన్ను చూడలేక బాధ పడ్తూన్న అమ్మానాన్నలకు నువ్వూ అన్నయ్యగా ఇక ఆశా కిరణాలు కళకళలాడ్తూన్న మీ జీవితాల్ని చూచుకోగల అదృష్టమైనా వాళ్ళకు కలుగనివ్వండి."

ఉష మౌనంగా నిలబడింది.

"నాకు తెల్సు, మా ఉష నా మాట తీసెయ్యదు" చెక్కిళ్ళు నిమిరి వెళ్ళిపోయింది ఆశ.

అదే అనునయం. అదే ఆజ్ఞ! ఆ ఆజ్ఞను ఆ చెల్లెలు అంతవరకూ ఎప్పుడూ మీరలేదు.

మెయిలు దిగిన సుభాష్‌ను కిరణ్‌కుమార్‌నూ సాదరంగా ఆహ్వానించి, అతిథి మర్యాదలుచేశాడు శేషగిరిరావు స్నేహితుడిని హాల్లో కూర్చోబెట్టి లోపలికొచ్చాడు సుభాష్ ఆ వచ్చినడి గుణగుణాలూ మెల్లగా అక్కకు చెపుతున్నాడు

అక్కడే ఆశాలత ఉషారాణికూడ ఉన్నారు, వంట పనిలో తల్లికి సాయపడుతూ.

''చూచావా అతడిని?'' అడిగాడు సుభాష్ రుక్మిణిని.

''ఆ, బాగున్నాడు, ఉషకు తగినవాడే. ఎలాగో పుణ్యంకట్టుకో.'' అర్థించుతూ నవ్వింది రుక్మిణి.

''కానీ ఒక్కటే లోపం'' సాలోచనగా అన్నాడు.

''ఏమిటి!'' ఆత్రుత కనపరిచింది రుక్మిణి.

''అతడికి రెండేళ్ళక్రింద పెళ్ళయింది!''

''ఆఁ!'' వింటూన్న ఆశ నిర్ఘాంతపోయింది, ఉష అవస్థ చెప్పనక్కర్లేదు. తలపై పిడుగులే వర్షించినట్లయింది.

''అయితే ఆ పిల్లపోయిందా?'' ఆనడిగింది రుక్మిణి.

''అవును. వివాహమైనా ఏడాదిలోనే ఏదో జబ్బుచేసి పోయింది. ఆ విచారంనుంచి ఈ మధ్యనే కోలుకొన్నాడు. ఇప్పుడు మళ్ళీ వివాహానికి సుముఖంగానే ఉన్నట్లు నా అభిప్రాయం. చూడక్కా - యోగ్యుడైనవాడు; చదువుంది, అందమున్నది. ఒకసారి వివాహమైన దన్నమాటే కాని ఎక్కువ వయస్సేమీకాదు. ఇరవై ఏడు-ఎనిమిద కెక్కువ లేవు. అమ్మాయి కిరవై ఏళ్ళుండనే ఉన్నాయి కదా?''

''అవును'' అంది రుక్మిణి. ''కట్నకానుక లేమాత్రంలో ఉన్నాడేమిటి?''

''అబ్బెబ్బే అటువంటివాడుకాదు. ఇదివరలో చేసుకున్న పిల్లకికూడా ఏమీకట్నం తీసుకోలేదు. చదువూ, అందం

చూచి పెళ్ళిచేసుకున్నాను. అయినా ఇదంతా నా ఆశ అత డసలు వివాహానికి సుముఖంగా వుండి, మన ఉషనచ్చితే కదా!" అంటూ స్నానానికి లేచాడు సుభాష్.

"వెళ్ళి మామయ్యకూ, ఆయనకూ నీళ్లు పెట్టిరా ఉషా" అని పుర్మాయించింది రుక్మిణి.

"అమ్మా! ఉషకేం తక్కువని రెండోపెళ్ళి వాడని ఆలోచిస్తున్నావు?" అంది ఆశ మెల్లగా.

"రెండో పెళ్ళయితేమాత్రం అతనికేం లోపమే? పైగా కట్నంకూడ అక్కర్లేదట!"

ఏదో అవ్యక్త ఆక్రోశపూరితమైనది ఆశాలత అంత రంగం. ఆ అల్లకల్లోలాన్నణచి వేసుకోవడానికి మెల్లగా అక్కడినుంచి వెళ్ళిపోయింది.

"డబ్బు! అందం-ఇంతేనా? వాటిలోనే యిమిడివుందా జీవన మాధుర్యం! ఇంతకు మించిన అతివిలువైన పవిత్రతా, ఆశలూ, ఆదర్శాలూ మాటఏమిటి? అమ్మకూడా ఒకప్పు డిటువంటి స్థితిలో ఉన్నదేకదా! అమ్మకు కన్నె హృదయం తెలియదా?"

నీళ్ళతోడి సబ్బువుంచి వెళ్ళిపోతూన్న ఉషను కేకేశాడు సుభాషు.

"అతను వచ్చాడటే" అనడిగాడు ఉష ముఖంలోకి చూస్తూ, కాని ధరణి కభిముఖమయివున్న ఉషారాణి వద నంలో భావాలేమిటో గ్రహించగల అవకాశం కలుగలేదత

డికి సిగ్గుగా అంచనా వేసుకున్నాడు. "అప్పుడే అంత సిగ్గు దేలికే? చదువుకుంటూన్నావు కూడాను" అన్నాడు.

ఉష మాట్లాడకుండా అక్కడినుంచి వెళ్ళిపోబోయింది.

"ఏమేవ్!" వెళ్ళిపోతూన్న ఉషను ఒక్క కేక పెట్టాడు,

"నీ సిగ్గు బంగారంగాను. ఆ మాట చెప్పొద్దు కాని ఇదేమిటే ఒళ్ళు రుద్దుకోవడానికి బట్టల సబ్బు నాముఖానకొట్టి పోతున్నావ్! అప్పుడే అంత పరధ్యాన మొచ్చేసిందేమిటి?"

'ఓ!' వెనక్కు తిరిగి సూటిగా చూచింది ఉష. పనికి రాదా? ఏదో ఒకటీ అదీ సబ్బేగా, పనికిరాదా?' నవ్వుతూ వెళ్ళిపోయి తిరిగి శాండల్ సోపు తీసుకొచ్చింది. మేనకోడలి హాస్యాలకు నవ్వుకున్నాడు సుభాషు.

భోజనాలదగ్గర కిరణ్‌కు ఉషను పరిచయంచేశాడు సుభాషు, మర్యాదకు నమస్కరించింది ఉషారాణి.

"ఏపి చదువుతున్నారు?" ఎంతో దగర పరిచయమున్నట్టు చిరునవ్వుతో అడిగాడు కిరణ్. అనిర్వచనీయమైన ఆత్మీయతాభావం గోచరించిందా స్వరంలో. ఎక్కడా నూతనత్వమే లేదు! కొంచందూరంలో ఉన్నఆశ తలెత్తిచూచింది. 'ఎంత ప్రశాంత వదనం!' అనుకొంది చూడగానే ఎందుకో తెలియని గౌరవం కలిగించే ఆ గంభీర విగ్రహం, అనిర్వచనీయ ఆత్మీయతాభావం తొణికిసలాడే ఆ నిర్మలదృష్టి, ప్రశాంత వద

నమూ మానవాళిలో అరుదుగా కన్పిస్తాయి. సౌమ్యత అంతా మూర్తీభవించిన కిరణ్‌కుమార్‌కు మనస్సులోనే అంజలి ఘటించిం ఆశ? 'ఫర్వాలేదు. ఉష అదృష్టవంతు రాలే. నేనే పొరబడ్డాను. ఏదో ఒకలోపం లేనిజీవితం ఉంటుందా ఈ భూమిమీద?' అనుకొంది.

ఉషారాణి కిరణ్ ప్రశ్నకు సమాధానంగా "బి. ఎ. ఫైనల్" అన్నది.

"గ్రూప్ ఏమిటి?" మరోప్రశ్న.

ఉష సమాధానం చెప్పింది; చెప్తూనే పనున్నట్లు అక్కడినుంచి వెళ్ళిపోయింది. క్రొత్తవ్యక్తి ముందు సిగ్గుపడు తున్నదనుకున్నారు. కిరణ్‌కుమార్‌తో సహా అందరూ.

"మీరు?" అడిగారు కిరణ్ ఆశావైపు తిరిగి.

ఆశ కళ్ళెత్తింది బరువుగా, ఆ విశాల నేత్రాలలోని గంభీరతా. విషాదమూ కిరణ్‌ను కలవరపరిచింది. అప్పుడే వివరంగా చూచాడతను, ఆశ కళావిహీన వదనాన్ని.

సమాధానం సుభాషు చెప్పాడు. "చదువుకోలేదు. చిన్నప్పుడే భర్తపోయాడు. ఇప్పుడిప్పుడే ఉష బలవంతం మీద మెట్రిక్ కడ్తోంది."

"క్షమించండి తెలియక అడిగాను," అన్నాడు జాలిగా చూస్తూ కిరణ్.

మెల్లగా అక్కడినుండి కదలిపోయింది, ఆశ.

మధ్యాహ్నం అందరూ నిద్రకుపక్రమించారు. అక్కా-చెల్లెళ్ళిద్దరూ మాత్రం కబుర్లలో పడ్డారు.

"ఉషా, అతను చాలా ఉత్తముడనిపిస్తోంది. దైవం అనుకూలిస్తే నీబోటి అదృష్టవంతురాలుండదు."

"అక్కా!" కోపం, అసహనం నాట్యం చేస్తున్నాయి ఉష గొంతులో.

"ఏం తప్పు అనలేదే? అతడిని పొందిన స్త్రీ ధన్యురాలు."

"తప్పో, ఒప్పో నా జీవితంగురించి నాకు తెలుసులే."

"ఉషా! నువ్వేనా ఆ మాట్లాడేది?"

"క్షమించక్కా, నీ కంటె చిన్నదాన్నైనా ఎక్కువ చదివినదాన్ని; బాగా ఆలోచించగలదానను. ముఖ్యంగా ఈ ప్రపంచంలో బ్రతకడానికి అవసరమైనంత స్వార్థం జీర్ణించుకున్నదానను. నావంటివాళ్ళనుగురించి ఎవ్వరూ ఆలోచించనవసరంలేదు. తమని తామే త్యాగం చేసుకునే నీబోటివాళ్ళను గురించే అసలు విచారించవలసింది."

"ఎందుకలా నిన్ను నువ్వే కించపరచుకుంటావ్? గడ్డిపోచవంటి నా కోసం ఎందుకు బాధపడతావ్. నీ ఔన్నత్యం అంటగట్టి, ఇక నీ ధోరణి మార్చుకోవా?"

"క్షమించక్కా, నన్ను బలవంతపెట్టకు కళ్ళు తెరచీ తెరవకముందే నీ జీవితాన్ని చేతులారా నట్టేటగలిపి, ఖర్మ అంటూ వదిలివేయడం ఎంత మూర్ఖత్వమో—స్వచ్ఛమైన

కన్యను రెండో పెళ్ళివాడి కంటగట్టడం అంత హాస్యాస్పదమే, అతడెంత ఉన్నతుడైనా కానీ.''

వంటగదిలోనికి పోబోతూంటే మామయ్య గొంతు విన్పించింది ఉషకు.

''ఇప్పుడతడిని మెల్లగా కదిపానక్కయ్యా, పునర్వివాహానికి ఇష్టపడ్డట్లే ఉంది ధోరణి ఇంతకూ అమ్మాయి కిష్ట మవ్వాలిగా? నువ్వు దా నభిప్రాయం కనుక్కో.''

"దానికి వేరే అభిప్రాయమేమిటి? మనమాట కాదనదు." రుక్మిణి గొంతు. ఝల్లుమంది ఉష గుండె. ''తన అభిప్రాయానికో విలువంటూ లేదా?''

సాయంకాలం వీధివరండాలో కూర్చున్నారు శేషగిరిరావూ, అతిథులూ, బత్తాయిరసం గ్లాసులు యిచ్చి వెళ్ళిపోతూన్న ఉషను వెనక్కి పిల్చాడు సుభాష్.

''చాల చప్పగా ఉందే!''

''చప్పగా ఉంటేనేం, పుల్లనై తేనేం? ఏదో ఒకటి చాలదూ?'' అంటూ పంచదార తెచ్చి యిచ్చింది ఉష. మళ్ళీ లోపలికిపోయి తాంబూలం పళ్ళెంతో తిరిగివచ్చింది.

''ఇంత పరధ్యానమేం? సున్నం మర్చిపోయావ్, త్వరగా తీసుకురా.''

''సున్నం ప్రత్యేకంగా తేవాలేమిటిలెద్దూ! ఆ గోడల నిండా సున్నమే, కాస్త అది రాసుకు వేసుకో'' అంటూ నవ్వుతూ పుస్తకం చేత్తో పట్టుకు కూర్చుంది.

"మామయ్యని బొత్తిగా ఆడించేస్తున్నావేమిటే?" నవ్వాడు శేషగిరిరావు.

"దానికెప్పుడూ నన్నేదో ఒకటి అననిదే తోచదు, మంచి ఛలాకీ అయిన పిల్ల లే. కిరణ్ చూస్తున్నావుకదూ?" అన్నాడు సుభాషు నవ్వుతూ.

కిరణ్ నవ్వలేదు. ఉషారాణిని నిశితంగా చూచాడు. తల పంకించుతూ దృష్టి మరోవైపుకు త్రిప్పాడు. అంతా లోపలినుండి వింటూన్న ఆశ సున్నంభరిణె తెచ్చి మామయ్య కిస్తూ, "ఆ పెంకెతనమేమిటి ఉషా?" అంది మందలింపుగా చెల్లెల్ని, ఉష మాట్లాడలేదు.

తర్వాత చాటున మెల్లగా చెల్లెల్ని కోపపడింది ఆశ. "మన మామయ్యతో మనం హాస్యాలాడుకుంటే అడుకోవచ్చుకాని పరాయివ్యక్తిముందు—అందులోనూ అతడిపై ఒక ఆశతో ఉన్నప్పుడు అదేం వెకిలిధోరణి? నీ ప్రవర్తన నాకర్థం కావడంలేదు."

తకీమని సమాధాన మిచ్చింది ఉష—"అర్థం అవ్వవలసిన వాళ్ళకయితే చాలులే. నీకేమీ అవ్వనక్కరలేదు."

నిర్ఘాంతపోయింది ఆశాలత. "చాలా మారిపోయావే ఈ ఒక్కరోజులోనే. నీకేమొచ్చిందో నాకు తెలియడం లేదు."

"మర్నాడు ప్రాతఃకాలం సుభాష్, కిరణ్ లేచివచ్చే సరికి ఆశాలతా ఉషారాణీ ఆవరణలో మొక్కల మధ్య కన్పించారు.

వారిని చూడగానే ఆశ పూలసెజ్జ వదిలేసి ఖంగారుగా అలా అలా తప్పుకుపోయింది పెరటివైపుగా.

రాత్రి కురిసిన పిడుగులవాన ఫలితంగా అవలంబనను వీడి నేలపై పడిపోయిన సుమలతలను ప్రయాసపడి తిరిగి చెట్లపై కెక్కించి ఆశ్రయం కల్పిస్తున్న ఉషారాణి చేస్తూన్న పని వదలి, అక్క అలా పారిపోవడానికి కారణమేమిటా— అని వెనుదిరిగి చూచింది.

వెళ్ళిపోతూన్న ఆశవైపే చూస్తున్న కిరణ్ "ఆమె అలా పారిపోతారేం మనల్ని చూచి?" అన్నాడు సుభాష్‌తో.

"ఆఁ! ఏమీ లేదు. 'విడో' కదూ?" అన్నాడు అతి సామాన్యంగా సుభాష్.

మౌనంగా తనలో తానే బాధపడ్డాడు కిరణ్.

పూలసెజ్జతో లోపలికి వస్తూన్న ఉషను చూచి 'లేవగానే నువ్వే కన్పించావే, ఏం జరుగుతుందో చూడాలి.' అన్నాడు సుభాష్ నవ్వుతూ.

ఛెళ్ళుమన్నట్టు జవాబు చెప్పింది ఉష! "అక్కడికి వాళ్ళ ముఖాల్లోనే గొప్ప యోగ్యత తాండవిస్తున్నట్లు అందరికి శకునాలే!" అంతకుముందే అక్క విషయంలో జరిగిన సంభాషణ వినివుండడంవల్ల ఆమె కుతకుత వుడికిపోతోంది కోపంతో.

అదేం పట్టించుకోకుండా. "మల్లెపువ్వువంటి చిన్నదీ....
........" అంటూ హాస్యంగా పదం అందుకున్నాడు సుభాషు. ఉష చేతిలోని మల్లె, కనకాంబరాలతో నిండివున్న సెజ చూస్తూ!

"మల్లెపూలంటే నాకు చాలా మక్కువ." అని చేయి చాపాడు కిరణ్.

ఇన్ని కనకాంబరాలు తీసి చేతిలోపోసి వెళ్ళిపోయింది ఉష.

'అవెందుకే వాసనలేనిపూలు?' అన్నాడు సుభాషు.

'అయితేనేం, పూలు కాక పోయ్యాయా?' తల త్రిప్పకుండానే అంటూ సాగిపోయింది ఉష. కిరణ్ చేతిలోని పూలు అతడికి తెలియకుండానే క్రిందికి జారిపోయాయి.

స్నానమైన తర్వాత కాఫీ తెచ్చి యిస్తూన్న ఉషను చిరునవ్వుతో పలుకరించాడు కిరణ్. "మంచి కాఫీయే తెచ్చారా, లేక ఏదైతే నేమని విరిగిన పాలేమైనా కలిపి తీసుకొచ్చారా?"

చటుక్కున తలెత్తింది ఉషారాణి; ఎదలో రేగిన ఆశ్చర్యాన్నణచుకొంటూ కిరణ్ నేత్రాలలోనికి సూటిగా చూచింది.

అదే నిర్మలమైన చిరుదరహాసం!

ఇరువురూ అలా అయిదునిముషాలపాటు ఆలోచనా పల్లవులలో అల్లుకుపోతూ పరిశీలనగా చూచుకుంటూ ఉండి

పోయాను, అవి చూపులు కాదు—రెండు సంస్కారహృద యాల అంతర్గత భావావలోకనం; రెండు విశాలహృదయాల జిజ్ఞాసాపూరితమైన మూగసంభాషణ! అక్కడ సామాన్య మానవ పరిభాషయొక్క ప్రజ్ఞ అత్యల్పం, అవసరంకూడా!

ఆ రోజు భోజనాలదగ్గర. "వంట ఎవరు చేశా రివ్వాళ?" అనడిగాడు కిరణ్ ఉషను.

"ఏం?" అంది ఉష సందేహంగా.

"మరేంలేదు. మీరైతే ఉప్పు అనవసర మనుకొని ఉండి క్రొత్తపాఠాలు రుచి చూపిస్తారేమోనని!" భావ యుక్తంగా నవ్వాడు కిరణ్.

ఉష అర్థయుక్తంగా తల పంకించింది.

శేషగిరిరావు మాత్రం అదేదో హాస్యమనుకొని గది దద్దరిల్లేలా నవ్వాడు. "అమ్మాయి వంటలో ఫస్టండీ ఎందరి కైనా యిట్టే చిటికెలో వార్చి వడ్డించేయగలదు" ఏదో అతడి తాపత్రయం అతడిది మరి!

భోజనాలైన తర్వాత శేషగిరిరావు ఆఫీసుకు వెళ్ళి పోయాడు; సుభాషు, కిరణ్ కుమారులు గదిలో కూర్చు న్నారు.

"మనం వచ్చి రెండురోజులైంది. ప్రయాణం మాట ఎత్తవేమిటి? మీ వాళ్ళేమైనా జాగీరుదార్లా! మనల్ని వెళ్ళ మనకుండా పోషించడానికి?" అన్నాడు కిరణ్ కుమారు నవ్వుతూ.

"ఇంకా వారంరోజు లున్నదిగా సెలవు?" అన్నాడు సుభాషు తాపీగా.

"అందుచేత ఆ పాపం వాళ్ళ నెత్తినరుద్దాలా? ఉదయం బండికి వెళ్ళిపోదాం." అన్నాడు నవ్వుతూ.

"వెళ్ళొచ్చు కాని, నినొ్నకటడగాలోయ్. ఇష్టాయిష్టాల సంగతెలావున్నా నువ్వేమీ అనుకోకూడదు. దాని ఫలితంవల్ల మనస్నేహం పాడవ్వకూడదు. అడగమంటావా!"

"నీ ఇష్టం. నాకు స్నేహమే కాని శతృత్వం అనుభవంలోనికి రాలేదింతవఱకూ!"

కొద్దిసేపు కిరణ్‌ను పరీక్షగా చూచి, నెమ్మదిగా అడిగాడు సుభాషు, "మా ఉషనుగురించి నీ అభిప్రాయమేమిటి?"

కొద్దిసేపు మాట్లాడలేదు, కిరణ్. "ఉత్తమురాలు, సంస్కారవతి." అన్నాడు తుదకు.

"అదే నా అభిప్రాయంకూడా. నీ బోటి సంస్కారవంతుడికి తగినదనే ఆశతో ఉన్నాను. నువ్వేమీ బాధపడవద్దు కిరణ్. ఎంతగానో ప్రేమించిన ప్రథమకళత్రాన్ని మర్చిపోవడం కష్టమే, కాని తప్పదు. భగవంతుడే మర్చిపొమ్మన్నాడు. ఇంకా నీ జీవితమంతా ఎదరే వున్నది. ఈ ప్రపంచంలో బ్రతికేటప్పుడు ప్రపంచ పద్ధతిని అనుసరించకతప్పదు.

నీరసంగా నవ్వాడు కిరణ్, "నిన్ను నీవు చూచాయగా కదిపినప్పుడే నీ మనస్సు గ్రహించాడు సుభాష్. ఈ రెండురోజులనుండి నేనూ ఆవిధంగానే పొరబడ్డాను—కాని నా పొరపాటు తెల్సుకున్నాను. ఆమెకు నేను తగుదునని భావించాననడంకంటె నాకు కావాలని ఆశించాననడం సమంజసంగా వుంటుంది. ఆ కాంక్షలో ఆమెకు నేను తగుదునా లేదా అని యోచించలేకపోయాను,"

"నువ్వు తగకేమయ్యా? అట్టే బెట్టుసరి చెయ్యక ఒప్పేసుకో" తేలికగా నవ్వాడు సుభాషు.

కిరణ్ నవ్వలేదు. గంభీరముద్ర దాల్చిన అతడి వదనంలో అనేకభావాలు - సామాన్యుల కవగతంకాని విస్పష్ట వినూత్న భావకిరణాలు ఒక్కటొక్కటే నెమ్మదిగా వెలువడసాగాయి, "నువ్వు ప్రతిదీ తేలికగా తీసుకుంటావ్, లోతుగా ఆలోచించవు. అందుకే అంత సంతోషంగా జీవించగలవు. కాని నేను ప్రతిదీ లోతుగా తర్కించి నిర్ణయించుకుంటాను. అందుకేనేమో భగవంతుడు నాకు జీవితంలోని లోతుపాతులన్నీ తెలియజెపుతున్నాడు."

"పరిమళభరితమైన నూతన వికసిత కుసుమం ఉష! ఆ ఆశాఘ్రాణిత కుసుమానికి మధురత్వం లోపించిన పానీయం వలె, తావిలేని పూవువలె, ఘాటులేని సున్నంవలె నేను తగను."

అర్థంకాక చిత్రంగా చూచాడు సుభాషు. "ఏమి టయ్యా నీ ఆలోచనలు?"

"అవును సుభాష్, ఉషారాణి వుత్తమురాలని అన్నాను అందుకే. మరో బాలిక ఎవరైనాసరే భయంతో తన భావాలను వ్యక్తం చేయకుండా పెద్దల ఆజ్ఞలకు తల వంచి, తాను మూగబాధ అనుభవించి, కట్టుకున్న వాడిని అను భవింపజేసును. ఉష ధైర్యంగా మృదువుగా తనభావాలనూ, అసమ్మతినీ వెల్లడించింది. మధురత్వం లోపించిన పానీయం జిహ్వను రంజింపజేయలేని విధంగా, పరిమళరహిత కుసుమం నాసికకు నిస్పృహ కల్గించే విధంగా, ఘాటులేని సున్నం తాంబూల చర్వణాన్ని రాగరంజితం కావింప అసమర్థమైన విధంగా - ఒకసారి జీవితంలో ప్రవేశించినవాడు కన్యహృద యాన్ని ఆకర్షించ అనర్హుడని చెప్పింది, ఎదురుగా వచ్చే వ్యక్తి యోగ్యతను ఆలోచించేముందు తన యోగ్యతను గురించి తెల్సుకోవాలని సూచించింది ధన్యుడిని.

"దానిమాటలలో అంత అర్థముందా?" విస్తు పోయాడు సుభాషు. కిరణ్! అదేదో తెలివితక్కువగా అంటే అలా కోపం తెచ్చుకుంటావా? పెద్దవాళ్ళం మేము లేమూ?"

"లేదు సుభాష్! తెలియని విషయాలను బోధించిన వారిని పిన్నలైనాసరే, పెద్దలైనాసరే గౌరవించి మన్నిస్తాను. కోపం తెచ్చుకోవడం నా స్వభావం కాదు. ఒక్క ఉషనే కాదు; ఇక ఏ అమ్మాయి విషయమూ ఆలోచించను. గతిం

చిన రాధ స్మరణలోనే జీవితం గడిపేస్తాను. ఆ తపస్సులోనే నాకు ముక్తి మోక్షం" దీర్ఘంగా నిట్టూర్చాడు. మెల్లగా వెళ్ళి పెట్టె, బెడ్డింగు సర్దుకోసాగాడు.

"అదే నిర్ణయమా!"

"అవును." ఇక యిక్కడవుండి ఉషకు బాధ కలిగించ లేను! ఉదయం ట్రెయినుకు వెళ్ళిపోదాం."

సాయంకాలం గొడ్డిలో నూతిగట్టు దగ్గర కూర్చుని యంత్రాంగం చేస్తున్నారు - రుక్మిణి శేషగిరీ, ఆశాలతా. మెల్లగా వచ్చి వారిలో జేరాడు సుభాషు. "అక్కయ్యా! రేపు ఉదయమే మేం వెళ్ళిపోతాం" అంటూ మెల్లగా విష యమంతా వివరించాడు.

వింటూనే ఉగ్రుడైపోయిన శేషగిరి, "ఉషా" అని ఒక్క కేక పెట్టాడు.

తండ్రి పిలుస్తే బెదిరిపోతూ మేకపిల్లలా వచ్చినిల్చునే ఉషారాణి యివ్వాళ బింకంగా, ఠీవిగా వచ్చి నిల్చుంది.

"ఏమిటె, వెకిలి వేషాలేస్తున్నావట ?"నిప్పులు కురి పిస్తున్నాయి శేషగిరి నేత్రాలు.

"ఏమిటీ?" తెలియనట్టు అడిగింది.

"అతడిని ఏమేమిటో అని కించపరుస్తున్నావట? ఏం పోయేకాలమే నీకు?" అనడిగింది రుక్మిణి.

"పోయేకాలం కాదు. ఇంకా మన్నేకాలమే లొంగుకూ బెణుకు లేకుండా చెప్పింది ఉష.

"నోరుమూసుకు చెప్పినట్టు విను. ఎవరిచ్చారే నీకింత చనువు?" తండ్రి గద్దించాడు.

"అనవసరంగా ఆవేశపడకు నాన్నా. జీవితంలో అత్యవసరమూ, అతి ముఖ్యమూ అయిన యిటువంటి విషయాలు తర్కించి ఆలోచించుకొనే ఓపిక లేక అరచుకోవడ మెందుకు? అనవసర చెత్తవిషయాలూ, లోకుల సంగతులూ మాట్లాడుకోవడానికి ఉత్సాహం దేనికి? నే చెప్పే విషయం కొంచం వినండి."

"పెద్దవాళ్ళు చెప్పినట్టు విను ఉషా. అనవసర కల్లోలం లేవదీయకు." ఆశ చెల్లెల్ని అనునయించి చెప్పబోయింది.

"దయుంచి నువ్వు మాట్లాడకు అక్కా. ఆలోచనలో నేను నీకంటె పెద్దదాన్ని."

"ఏమిటా ఆలోచన?" హేళనగా నిరసనగా అడిగాడు శేషగిరిరావు;

"రెండో పెళ్ళివాడిని చేసుకొనే ఖర్మ నాకు పట్టలేదు-అతడెంత యోగ్యుడైనా సరే."

"ఓసి నీ అసాధ్యం కూలా! రెండో పెళ్ళయితే ఏం లోటే? మన్మథుడిలాగున్నాడు, వయస్సుకూడా ఎక్కువ కాదు."

"ఓహో? అయితే అపరగంధర్వ కన్యలా వుంటుందే అక్కయ్య? పాతికేళ్ళయినా లేవు. దాన్నలా ఇంట్లో మ్రగ్గబెడ్తున్నావేం? దాని పెళ్ళివిషయ మెందుకాలోచించవు?"

కాంౘడించి తుపుక్కున ఉమ్మేశాడు శేషగిరి, 'ఛీ!' అప్రాచ్యురాలా! ఆడదానికి రెండో పెళ్ళటే? నువ్వసలు అయినింటి ఆడదానివేనా?

"ఏమో, ఏయింటిదాన్నో - నాకంటే బాగా మీకే తెలియాలి. దానికేం గాని మగవాడికి రెండో పెళ్ళికి లేని అభ్యంతరం ఆడదానికేమిటి?"

"దీనికి పిచ్చిగాని, ఎక్కలేదు కదా?" తల్లీ తండ్రి ఒక్కసారే అరిచారు.

"ఇంకా ఎక్కలేదు కానీ, అక్కయ్య నిరర్థక జీవితాన్ని యిలాగే మరికొంతకాలం చూచానంటే తప్పకుండా పిచ్చే ఎక్కుతుంది."

"ఒక శామాన్య విషయంగురించి నువ్వు తర్కిస్తే ఏం ప్రయోజనమే ఉషా? స్త్రీ పునర్వివాహం గౌరవకుటుంబాలలో నిషిద్ధం; అప్రతిష్ఠ కూడాను" అన్నాడు సుభాషు.

ఆశాలత ముఖం రెండుచేతులతోనూ కప్పుకుని నిశ్శబ్దంగా రోదిస్తూ అక్కడినుండి వెళ్ళిపోయింది. రుక్మిణీ మౌనంగా కళ్ళుతుడుచుకుంది, ఏడుస్తూపోతున్న పెద్దకుమార్తెను చూచి ఉషారాణి నేత్రాలుకూడ సజలమయ్యాయి.

"అటుచూడండి నాన్నా! అక్కయ్య అలా క్రిగ్గుళ్ళి ఏడ్వడం మీకేమైనా బాగున్నదా? నాకూ దానికీ వయస్సులో అట్టే తేడాలేదు. నాకున్న ప్రతికోరిక తనకు కూడా

ఉండడం సహజం, కాని అవి తనలోనే అణగద్రొక్కుకుని ఎంతబాధ ననుభవిస్తుందో ఎప్పుడైనా ఆలోచించారా? నేనూ, అమ్మ రంగురంగుల చీరలు కట్టుకుంటూంటే దిగులుగా తన తెల్లగుడ్డలవైపు చూచుకుని నిట్టూర్పుతుంది. మేము తలలో పువ్వులు పెట్టుకుంటే కళ్ళు యింతింత చేసుకుని ఆశగా చూస్తుంది, చాటుగా కళ్ళు తుడుచుకుంటుంది. ఎందుకు దానికీ శిక్ష!''

''భగవంతుడు దాని మొహాన అలాంటి రాత రాస్తే మనమేం చేయగలము శేషగిరిరావు కోపమంతా ఏమైపోయింది దిగాలుగా వుంది గొంతు.

''మగవాడికీ అలాటి రాత రాస్తున్నాడు దేవుడు. కాని వీడి బ్రతుకు యిక యింతేనని మూల మగ్గబెడ్తున్నారా? వేషభాషలకు దూరం చేస్తున్నారా? అలాగే ఆడదాన్ని ఎందుకు జూడరు? ఇంట్లో తల్లీతండ్రే సంకోచించకుండా ఆంక్షలు విధిస్తే ఇక పైవాళ్ళ సంగతి చెప్పాలా? ఇది పుట్టిన నాటి నుండి పెట్టుకొనేబొట్టు, పువ్వులూ - మగడు తీసుకొచ్చినవి కాదు అయినా అతడు చనిపోగానే అవి ఎందుకు తీసేయాలి? ఆలా బోడిబొమ్మలా ఎందుకు నిలుచోవాలి? బొట్టు పెట్టుకోకూడదు; అలంకరించుకోకూడదు; పువ్వులు ముట్టుకోకూడదు—అని అనుక్షణం గుర్తు చేసుకుంటూ ఎందుకు బ్రమపోవాలి?

ఎన్నడూ తిన్నగా తనముందు తలే ఎత్తలేని కూతురి వాగ్ధోరణికి విస్తుపోయి జూచాడు శేషగిరిరావు. రుక్మిణి

కనులు గంజీపడ్డ చెరువుల్లావున్నాయి. సుభాషు కదలిపోయిన హృదయంతో తల దించుకున్నాడు.

తిరిగి ఉషే అన్నది; ఆ అలంకారంచూచి మెచ్చవలసినవాడు లేడు గనుక అది అనవసరమని అందులోని అర్థం. కాని మనసులో లేని ఆ విరక్తి కేవలం అచరణలవల్ల లభ్యమవుతుందా? నాలుగేళ్ళ పసిపిల్లలా వున్నప్పుడు జరిగిన ఆ వివాహపు తంతుగానీ, భర్తసుఖంగానీ ఏమీ తెలియని-ఏమీ గుర్తులేనివాళ్ళకు విరక్తి ఎక్కడినుండి వస్తుంది. తన కేదో అన్యాయం జరిగిందనే బాధ తప్ప?"

'ఇంతకూ ఏమంటావునువ్వు? అనడిగింది రుక్మిణి ఎలాగో కంఠం సరిచేసుకుని "మొగుడు చచ్చి అలాటివేషాలు వేస్తే నలుగురూ నవ్వరూ?"

"నవ్వుతారని నీ ఊహ. నవ్వితే మనకేం? ఎందుకు నవ్వుతారు? ఒకళ్ళని నవ్వడమేకాని లోకానికి మరేమీ పని లేదా? నవ్వినా, ఏడ్చినా నాల్గురోజులుపోతే - మర్నాడింకో క్రొత్తవిషయం దొరికితే ఇది మర్చిపోయి అందులోపడ్తారు? అయినా ఆమాత్రం ఊహ, బాధ్యత ఎవర్నిగురించి వాళ్ళకుండాలి కాని, ఇంకొకళ్ళకు జడిసి ఎన్నాళ్లు బ్రతుకుతారు? మరొకళ్ళజీవితాల్ని మనం హేళన చేయకుండా వుండడమే మనకర్తవ్యం. ఎవరో ఏదో అంటారు కాని, మోడువారిపోయినదాని బ్రతుకుకు సంతోషం చేకూర్చగలరా, వాళ్ళలో ఒకళ్ళయినా? ............... వాళ్ళకా అవసరంలేదు........

బాధ్యతా లేదు. పిల్లల సుఖసంతోషాలకై తాపత్రయపడ వలసిన బాధ్యత తలిదండ్రులదే. 'ఇదిగో ఉషా!' గంభీరంగా సంబోధించాడు తండ్రి. ఆ బాధలన్నీ నాకూ కడుపులో వున్నాయి ఏం చేస్తాంమరి? తీరేదారి లేదు ఏం చేయమంటావు?"

"మళ్ళీ పెళ్ళి చెయ్యమంటాను."

"ఏమన్నావ్?" నెత్తిమీద పిడుగులు పడ్డట్లే అదిరి పడ్డాడు?

"అవును. మూఢనమ్మకాలతో ఎవరో కాటికి కాళ్ళు చాచుకున్న ముసలమ్మ తృప్తికోసం కళ్ళు తెరవనిపసిదానికి ఎవరో ఒకడిని కట్టబెట్టి, దాని బ్రతుకు వల్లకాడు చేయడం సహించనంటున్నాను."

కొద్దిసేపు మౌనంగా గడిచిపోయింది.

సుభాషు మెల్లగా అన్నాడు: "పోనీ నువ్వు అన్నట్టె మళ్ళీ పెళ్ళిచేద్దామన్నా చేసుకొనే వాడెవడుంటాడే? కబుర్లే కాని ఎవరు ముందుకొస్తారు?"

"ఎందుకురారు? అక్కడక్కడా వుంటారు ఉత్తములు. కొంతకాలం కాపురం చేసినవాళ్ళనూ, పిల్లల తల్లులను చేసుకుంటున్నారు కొందరు. బాల వితంతువును చేసుకోవటానికేం?"

శేషగిరిరావు నూతిగోడకు జేరగిలబడిపోయాడు.

"చూడు ఉషా" ముక్కుచీదుతూ చెప్పింది రుక్మిణి; "శుభంగా నీ విషయం తలపెడితే దురదృష్టవంతురాలిగోడవ

అఘ్హుపెట్టుకు కూర్చుంటా వెందుకు? దాని రాతేదో అలా తగులబడింది. నీ మాత్రం బాధ మాకూ వుంది."

"బాధ ఉన్నదానవైతే అలా ముక్కు మూసుకు కూర్చోవడం కాదు. ముందు దాని విషయం ఆలోచించి గట్టెక్కించాలి. అప్పుడు కాని నావిషయం నే నాలోచించను." ఖచ్చితంగా అన్నది.

"ఏం ఖర్మ వచ్చిపడిందిరా నాయనా? దానికూడా ఆ నాలుగై దేళ్ళప్రాయంలో చేసి పారేస్తే వదలిపోను శని. దేని అదృష్టం ఎలాగుంటే అలా జరుగును. ప్రూనులకు మళ్లే ఎదిగి మాటవినకుండా పోతున్నారు. దాని ఖర్మ అలా కాలిందా? దీనికి పెంకెతనమా?" బాధగా నుదురుకొట్టు కున్నాడు శేషగిరి.

ఉషకోపం అవధులు దాటిపోయింది. "అవును. ఎప్పుడో ఒకప్పుడు మొక్కుగా తీర్చేసుకొందురు పాపం ఫలితలతో మీకు నిమిత్తంలేదు. తలిదండ్రులై యుండి యింత కఠినంగా ఎలా మాట్లాడగలుగుతున్నారో నా కాశ్చర్యంగా వుంది." ఒక్కక్షణం ఆగి తిరిగి మొదలుపెట్టింది." నేను పెంకెతనం చేస్తున్నానని అనుకోకండి నాన్నా. అక్కని గురించి ఒక్కసారి దయగా ఆలోచించండి.

"ప్రొద్దున్నే లేచీ లేవడంతో ఆమె ముఖం మీకు కన్పించకూడదు ఉదయం వేళల్లో అలా చాటు మాటున దాక్కుంటా వెందుకక్కా" అనడిగాను ఒకసారి చిన్న

తనంలో తెలియక 'ప్రొద్దున్నే నా ముఖం ఎవరికీ కన్పించ కూడదమ్మా!' అంటూ ఏడ్చింది అక్క. తెలిసే తెలియని ఆ ప్రశ్నతో ఆమె నెంత క్షోభింప చేశానో అని జ్ఞానంవచ్చిన నాటినుండి నేను బాధపడని రోజులేను. ఇదెంత బాధా కరమో ఆలోచించండి నాన్నా.

"పూజఅయ్యేవరకూ అమ్మను వితంతువు కన్పించ డానికి వీలులేదు. మాట్లాడదు. పొరపాటుగా అక్క ఎదురు పడినా, ఏదో చండాలాన్ని చూచినట్టు ముఖం మరో ప్రక్కకు త్రిప్పుకు వెళ్ళిపోతుంది. మీ కాఫీ ఉపాహారాల సేవన అయ్యేవరకూ అక్క బయటిగదులలోకి రాకుండా అ మూలా ఆ మూలా పడివుంటుంది. ఒకనాడు అన్నయ్య పరీక్షకు వెళ్తూ అక్క ఎదుట పడ్డదని విసుక్కురటూ వెనక్కు వచ్చేసి మంచినీళ్ళు త్రాగివెళ్ళాను. కన్నకూతురని కూడా లేకుండా అమ్మ విసుక్కుంది 'ఎవరైనా ఎక్కడైనా వెళ్ళే ప్రయత్నంలో వున్నప్పుడు కాస్త ఓ చాటున పడివుండకూడదమ్మా?' అని. ఆ వేళంతా భోజనం మానేసి ఏడుస్తూ కూర్చుంది అక్క. నీకు గుర్తుందామ్మా?"

ఎవ్వరూ మాట్లాడలేదు.

"తల్లిదండ్రుల దగ్గర, పుట్టింట్లోనే యిలాగుంటే యిక మరోచోట అటువంటి దాని స్థితి ఎలాగుంటుంది? కలకాలం మీరు వుండరు! దానికి పాతికేళ్ళు పూర్తిగాలేవు. జీవించవలసిన కాలం ఎదర యింకా ఎంతో వున్నది. ఎవరి

వంచన బ్రతుకుంది? నాకు పెళ్ళి అవుతుంది. నా భర్త, పిల్లలు సంసారం అనేస్వార్థం ఏర్పడిపోతుంది. ఆ స్వార్థ చింతనలో నా అక్కపై నాకు యివ్వాళ ఉన్న ఆత్మీయతలో సగంకూడా ఉండదు. నా భర్తతో మాట్లాడితే నేనే అనుమానించే పరిస్థితి రావచ్చు........ఇవ్వాళో రేపో అన్నయ్యకు పెళ్ళవుతుంది. వదిన వస్తుంది. వదినా ఆడపడుచుల మధ్య పొత్తు ఏమాత్రమో మనకు తెలియనిదా? అందరి అదలింపు, విదలింపుల మధ్య వాళ్ళ పిల్లలకూ వాళ్ళకూ ఊడిగంచేస్తూ బ్రతకడంకన్న వితంతువుకు మరోదారి లేదా?

"తెలిసీ తెలియని పసితనంలోనే ఏమిటో పెద్దవాళ్ళమై పోవాలని వాళ్ళమాదిరి జీవితం సాగించాలని కోరిక కల్గుతుంది. ఆ రోజులలో....బొమ్మలతో ఆడుకొనే ఆ ఆటలోనే అజ్ఞాతంగా వాళ్ళలో వుండేకోర్కెలు ప్రతిఫలిస్తాయి! చిన్నతనంలో పెద్దగా ఎదగాలని యౌవనంలో జీవితానికి సంపూర్ణత్వం చేకూర్చాలనీ, ఆ పరిపూర్ణత జీవితంలో సంతాన సఫలత పొందాలనీ, అటుపిమ్మట ఆ తన జీవితఫలాలు ఎదిగి శాఖోపశాఖలుగా విస్తరించాలనీ స్త్రీ కోరుకుంటుంది; ఆ పరీక్షలోనే జీవితం తేలుస్తుంది' కాని అన్ని ఆశలకూ కోర్కెలకూ దూరమైన అక్క బ్రతుకులు, ఒకరికి ఊడిగం చేసే జన్మలు ఎందుకు నాన్నా? ఏ ఆశా లేని జీవితం ఎవరి కోసం....'' కన్నీళ్ళు బొటబొటా జారిపోతూంటే యిక మాట్లాడలేక అక్కడినుంచి వెళ్ళిపోయింది.

గాలివాన వచ్చి వెలిసిన అనంతరం ప్రకృతి స్వరూపంలా గృహవాతావరణంలో గంభీర నిశ్శబ్దత అలముకోంది. అతిథులు మినహా యింటిలో ఎవరూ భోజనాలు చేయలేదు. ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు.

అర్ధరాత్రివఱకూ ఏదో నవల చదువుతూ గడిపేశాడు కిరణ్. నవలమూసి బల్లపై వుంచుతూ ప్రక్కకుచూచాడు. సుభాషు గాఢనిద్రలో వున్నాడు, టైము పన్నెండున్నర!

నవ్వుకున్నాడు 'ఎంత అదృష్టవంతుడు! నా కింకా నిద్రపట్టడంలేదు.

లేచి కిటికీదగ్గఱకు వెళ్ళాడు.

హేమంతంగడిచి శిశిరం ప్రవేశించింది. నదీ తీరస్థం కావడంవల్ల చలిహెచ్చుగానే వుంది వెన్నెలలో నిశ్చింతగా, నిర్మలంగా శయనించింది లోకం. అప్పుడే వికసిస్తూన్న పూల సౌరభం గుబాళించుతోంది. శార్వరీ కాంతిలో వృక్షాలు వర్ణనాతీత సౌందర్యం సంతరించుకున్నాయి.

ఆ నిర్మలసౌందర్యాన్ని మైమఱచి తిలకించుతూన్న కిరణ్ కంటికి ఒక్కసారిగా కంటకం గ్రుచ్చుకున్నట్లు ఏదో దృశ్యం కన్పించింది!

'ఎవరు? అశోకవృక్షంక్రింద సీతాదేవిలా, పున్నాగ వృక్షంక్రింద ఆ చలిలో శోకించుతూన్న ఆ ఆకారం ఎవరిది? బహుశః ఆశాలతేమో! నిద్రపట్టక బయటకు వచ్చి కూర్చు

న్న దేమో—నాకెందుకు?'అనుకొని ప్రక్కపై పడుకున్నాడు. కాని మనస్సు అంగీకరించలేదు.

"బాధపడేవాళ్ళను ఓదార్చడం మానవధర్మం." అన్నది మనస్సు. నిశ్శబ్దంగా గది బయటకు వచ్చి నెమ్మదిగా అటువైపు నడిచాడు.

'అరె! ఆశకాదు, ఉష!"

"ఉషారాణీ!" నెమ్మదిగా పిల్చాడు.

ఖంగారుగా లేచి వెనుకకు రెండడుగులువేసి విస్ఫారిత నేత్రాలతో చూడసాగింది ఉష.

"ఎందుకమ్మా అంత కలవరం? నేను దుర్మార్గుడిని కాను. ఈ సమయంలో ఎవరో నిరోదిస్తున్నారు, చేతనైతే ఓదార్చుదామని వచ్చాను_అంతే."

ఆ సౌమ్య సంబోధనకు నిశ్చేష్టురాలైంది. ఉష కొంతసేపు. కొద్దిసేపటికి తేరుకుని; "ఇవి ఎవరూ తీర్చేబాధలు కావు కిరణ్‌బాబూ!" అంది శోకాన్ని అదిమి పెడుతూ.

"ఎవరి శోకమూ ఎవరూ పోగొట్టలేరు. కాలమే తీర్చాలి. భగవంతుడే పోగొట్టాలి. నేను ఓదార్చడానికి వచ్చాను. అంతే."

"..........."

"చూడు ఉషా, సున్నితంగా నువ్వుచేసిన సూచనలు నేను గ్రహించాను. ఏడవకు, ఏ కారణంవల్లనైనా నువ్వు

అంగీకరించినా నిన్ను నేను వివాహమాడనని మాట యిస్తు న్నాను!''

అతడిలోని పరివర్తనను ఆశ్చర్యపోతూ మాట్లాడలేక పోయింది ఉష.

''కాని ఉషా! ఏమీ అనుకోకంటే ఒక్క విషయం అడగాలనుంది. నాకంటె చిన్నదానవైనా నీకు అనేకం తెలుసని నేను కనిపెట్టాను. తెలియని విషయాలు చిన్నవారినుంచైనా అడిగి తెల్సుకోవడంలో నామర్దా లేదు.''

''అంత గొప్పదానను కాను. అయినా ఏమిటది?'' ఆశ్చర్యంగా అడిగింది ఉషారాణి.

''ఏం లేదు. ఒక భార్యపోతుంది. ఆమెను మరచిపోలేకపోవడం సహజం. కాని మానవదేహ పరిత్యక్తఅయిన అమె నేనెంత తననుగూర్చి తపస్సుచేసినా ఈ మానవలోకములో నివసిస్తూన్న నాకు ఏ విధంగానూ ఉపయుక్తంకాదు. ఈ ప్రపంచంలో బ్రతికేటప్పుడు దానిః ధర్ములకలవడిపోవాలి. నేనింకా చాలాకాలం జీవించవలసి ఉందని భావిస్తున్నాను. అంత ఆయువు లేకపోతే అదృష్టవంతుడినే. కాని వుంటే నా గతేమిటి? అనేకవిధాలుగా నా ఆలన పాలనలు చూడవలసిన వ్యక్తి ఒకామె అవుసరం కదా? నాకు తల్లి లేదు, తోబుట్టువులు లేరు. మరి బాలికలంతా మీ మాదిరే భయపడ్తారు— ఒకసారి ఒకస్త్రీని మట్టిలో కలిపిన నన్ను చూచి, నాకర్తవ్యమేమిటంటారు?''

దీర్ఘంగా నిట్టూర్చింది ఉష.

"మీరే నేననుకుని, ఈ సమస్య మీదిగా భావించండి ఉషా, అప్పుడేం చేస్తారు?"

"నేనే మీరైతే ఈ సమస్య రాదు కిరణ్ బాబూ!" స్థిరంగా గంభీరంగా అంది.

"అంటే?"

విరసంగా మూలిగింది ఉష. "కొన్ని విషయాలు తెలుసు కోకపోవడమే మంచిది. అబద్ధంకూడదు; నిజం కఠినంగా ఉంటుంది."

"చెప్తానన్నారని అడిగాను."

"సరే అయితే నేను చెప్పేదానికి మీరు తట్టుకో గలగాలి.

"ఆ భయ మనవసరం."

"అంతగా ప్రేమించి ఆరాధించిన అపురూప వ్యక్తి-ఆ రవ ప్రాణమూ లేకపోయిననాడు యిక నేనూ వుండను. ఇహ లోకంకోసం ప్రాకులాడను."

'ఆఁ?'

'అవును. 'ఆత్మహత్య' అంటే మహాపాతకమనే అభిప్రాయం నాకు లేదు. ఇష్టమున్న పనిచేస్తాం, లేనిదిలేదు. అలాగే యిదీని—జీవించడం యిష్టంలేనప్పుడు సంతోషంగా మానివేయగలను.'

'ఉషా!' అదిరిపడ్డాడు కిరణ్.' నీ మనసెంత మంచిదో హృదయమంత కఠినమైనది.'

నీరసంగా నవ్వింది. 'నిజ మెప్పుడూ నిష్ఠూరంగానే శబ్దిస్తుంది. అందుకే చెప్పాను. కొన్ని కొన్ని విషయాలు తెల్సుకోకుండేనే బాగుంటుందని, కాని ఇప్పుడు నేను చెప్పినది కేవలం నా వ్యక్తిగతవిషయంలోనని మీరు గుర్తించాలి. అదే సర్వప్రామాణికం కావాలనే దురభిప్రాయం మాత్రం నాకు లేదు. అందరికీ అంతవిరక్తీ, నిగ్రహం కొన్ని కొన్ని పతనాలూ, ఘోరాలూ జరగకుండావుండాలంటే పునర్వివాహమే శరణ్యం.'

'ఉషా. నిన్నర్థంచేసుకోలేకపోతున్నాను.'

'కొంచం ఆలోచించండి. అదే అర్థమవుతుంది. ఈ ఇంటి అల్లుడిగా అవ్వాలనేగా అనుకున్నారు? అలాగే అయితే బాగుంటుందని నా ఆశ!'

'ఉషా ఏమిటి దీనర్థం? నన్ను పరీక్షిస్తున్నావా? నిన్నే కాదు. ఏ బాలికగురించి ఆలోచించవచని హామీయిస్తున్నాను. ఏ బాలికైనా నీలాగే బాధపడుతుంది. ఇక నేను పునర్వివాహ విషయమే ఆలోచించను.

'మంచివాళ్లు ఈ ప్రపంచంలో త్వరలో చచ్చిపోతారట. నా రాధ ఎంత ఉత్తమురాలనుకున్నావ్? అందుకే దేవతలు అంత తొందరగా తీసుకుపోయారు. ఆమె మంచితనాన్ని మాటలలో వర్ణించలేం. రాధను విస్మరించడం అసాధ్యం. తాత్కాలికంగా నేనామెను మరువ ప్రయత్నించినా నువ్వు జ్ఞానం బోధించావు.'

'అందుకే ఏడుస్తున్నాను కిరణ్!'

'ఆఁ!' నిర్ఘాంతపోయాడు కిరణ్, 'మీరసలు తెలివిగా వున్నారా లేక నిద్రలో నడచి వెళ్ళిపోయి, మాట్లాడేసే అలవాటుందా?'

'ఎందుకలా చూస్తారు? నేను తెలివిగానే మాట్లాడుతున్నాను. పిచ్చెక్కలేదు.'

'మరి నాకు బోధపడలేదు?'

'బోధపడేందుకేముంది? ముందు వ్యక్తి స్మృతిని మీరు మనసునుండి దూరం చేసుకోలేకపోవటం సహజమే. అది నవవధువు సహించలేదు కాని, మీవంటి వ్యక్తే సహించగలరు. ఆమె మనస్సో జీవితమో మరొక వ్యక్తికి సంబంధించివున్న స్త్రీ మీలోపానికి తనలోపం అడ్డువేసి సరిపెట్టుకుంటుంది.'

'ఉషా!' దిగ్భ్రాంతితో అరిచాడు కిరణ్.

'అవును. ఆవేదనపడకండి మీరు భార్య నెరుగుదురు. మా అక్క ఆశ అదీలేదు. దానికి నాలుగేళ్ళ వయసులో వివాహమైంది. భర్త ముఖమే ఎరుగని యువతిని భార్యగా గ్రహించలేరూ?''

'ఉషా! తర్కవాదమైతే బాగానే వుంటుంది కాని మనస్సు మాట? మన సంస్కృతి మాట? నేను మగవాడిని. ఒకసారి వివాహమైన స్త్రీని నేనెలా గ్రహించగలను?'

"తెలుసు-మీరలాగంటారని, అయిన సంభాషణా ధోరణి పెరిగిపోయి యింతవరకూ వచ్చాంకాని, లేకుంటే నేడు మీకు సలహా యివ్వను. మీ యిష్టంమీద కాని, సలహాలిచ్చి శాసించే అధికారం లేదు నాకు మీపై.

"——" కిరణ్ మాట్లాడలేదు.

"బ్రహ్మచారి యువకులుకూడ అటువంటి బాలవితంతువులను విశాలహృదయంతో చేసుకోవడం అక్కడక్కడా వుందనుకోండి. అయినా బాగా అరుదే. కాని ఒక్కవిషయం చెప్పదలచుకున్నాను. ధర్మశాస్త్రమంటూ పక్షపాతంగా చేతికొచ్చినది వ్రాసిన మానవుల నెత్తిం రుద్దిన 'మనువు' స్త్రీ అయివుంటే ప్రస్తుతం పురుషు లవలంబించే స్వేచ్ఛాప్రవృత్తులన్నీ స్త్రీల పరంగానూ, స్త్రీలు పాటించవలసిన నిబంధనలన్నీ పురుషుల కన్వయించేట్టుగానూ వుండును."

"నేనంతదూరం ఆలోచించి మాట్లాడలేదు ఉషా నెమ్మదిగా అన్నాడు కిరణ్.

"ఇప్పుడైతేనేం! ఆచిలోంచండి. నేను పురుషుడిననే అహంకారంతోగాక, ఎవరేమనుకొంటారోననే బెదురుతోగాక న్యాయాన్యాయ విచక్షణతో ఆలోచించండి ప్రాచీన ధర్మశాస్త్రాలైనా, ఆధునిక నీతి చంద్రికలైనా పూర్తిగా నమ్మి అనుసరించకూడదు. మంచిమాత్రమే గ్రహించాలి.

"అదేమిటో కాస్త వివరిద్దురూ."

'కళలకు దూరమైన ఒక స్త్రీని కళాప్రపూర్ణను చేయడంలో మీ జీవితం ఎంత ధన్యమవుతుందో; చిత్రమైన చెరసాలకాని చెరసాల జీవితం అనుభవిస్తూన్న అబలకు విముక్తి ప్రసాదించడంలో మీకెంత తృప్తి లభిస్తుందో; ప్రపంచానికి తన అశోభస్కరవదనాన్ని చూప వెరచే ఒక స్త్రీ నుదుటి తిలకంలో మీరు వెలుగుగొందడంలో మీ జీవితం ఎంత శోభిస్తుందో ఆలోచించండి— సహగమనం మాన్పించిన పుణ్యాత్ముడని చరిత్రలో లిఖించి అందరూ పొగడే ఆ వ్యక్తి ఎందుకలా అనాలోచితంగా చేశాడా అని వాపోతూంటాను నేను. ఎంత కురూపి అయినా స్త్రీ సహజంగా అలంకార ప్రియ. అలంకారానికి దూరమైన స్త్రీ హృదయవేదనను అతడు పురుషుడు గనుక అర్థం చేసుకోలేకపోయాడు. ఏ మాత్రం అర్థం చేసుకోగలిగినా, అగ్నిజ్వాలలో కొద్దినిమిషాలకాలం మాత్రమే బాధపడి పవిత్రంగా ఆహుతైపోయే అదృష్టదశనుండి జీవితాంతం చిత్రహింస ననుభవించే హీనస్థితిలోకి త్రోయుడు."

"ఉషా!" ఆవేశంగా అరిచాడేకాని ఆ సమయంలో కిరణ్ కంటికి కన్పించినది ఒక్క ఉష రూపమే కాదు_ కోట్లాది భారతవనితల ఏకాత్మ! ఆ విన్పించేది ఒక్క ఉష కంఠంకాదు—అల్లాడిపోతూన్న అనేకమంది స్త్రీలసహైక ఘోష!

'ఏమంత ఖంగారు పడుతున్నారు?'

"మరి నలుగురూ వున్న ప్రపంచంలో నలుగురి మాటలూ, అభిప్రాయాలతో పనివుంటుంది కదా ఉషా!"

చిన్నగా నవ్వింది ఉష. నిర్లక్ష్యంగా "ఇప్పు డిక్కడ ఈ సమయంలో యిలా మాట్లాడుకోవడంగురించి నలుగురి అభిప్రాయం, మనకు తెలిసిన యదార్థానికి భిన్నంగా వుంటుంది. అయినా మనకు లెక్కలేదు. మన నైర్మల్యం మన అంతఃకరణ మనకు అల్పుగనుక, అలాగే యిదీని"

"కట్నం కోరకపోవడం మీరు ఆదర్శంగా భావించారు, రాధను కోరి చేసుకున్నప్పుడు, అది కూడ నలుగురికి భిన్నమైన పద్ధతే, దానిపై నకూడా పదుగురి వ్యాఖ్యానా లుంటాయి అయినా అప్పుడు మీరు లెక్కజేశారా? వ్యాఖ్యానాలు చెయ్యడం మానవసహజం. మనమూ చేస్తాం అప్పుడప్పుడు యితరులగురించి, కాని వెంటనే మరిచిపోతాం, అలాగే మన విషయంలో యితరుల అభిప్రాయాలుకూడ. వాటిని లెక్కజేసుకోకూడదు.

"పురుషుడికి ఆలన పాలనను చూచే స్త్రీ అవసరం ఈ ప్రపంచంలో"—అన్నారు మీరు. అలాగే స్త్రీకి కూడా పురుషుడి అండదండలు అవసరం, ఈ ప్రపంచంలో, తనకు ఒకసారి జరిగిన లోటును భర్తీ చేసుకొనే అవకాశం పురుషుడి కున్నప్పుడు స్త్రీకికూడా అటువంటి అవకాశం వుండాలనడంలో తప్పులేదేమో?"

"ఉషా!"

"అవును. వెంటనే మీ మనస్సు అంగీకరింప లేక పోవచ్చు. కాని జాగ్రత్తగా ఆలోచిస్తే సమన్వయించుకో గలరు........మీరొక ఆశతో యిక్కడి కొచ్చారు. నేనొక ఆశతో మమ్మల్ని గౌరవించాను. ఈ రెండు ఆశాకిరణాలనూ మిళితంచేసి, శుష్కించి పోయిన ఆశాలతను పుష్పింప జేయండి."

కొద్దిసేపు గడిచింది. కిరణ్‌కుమార్‌ను అతడిఆలోచన లకు అతడిని వదలివేసి, తాను మెల్లగా లోపలికి పోయింది ఉష. అలా నిముషాలు, గంటలు కొట్టుకుపోయాయి, ఆ యోచనా సముద్రంలో.

తిమిరాచ్ఛన్నమైన జగతిని క్రమంగా వెలుగు రేఖ లావరించాయి. పక్షుల కిల కిలారావాలకు, అలోచనలు మాని, చకితుడై తలెత్తి జూచాడు కిరణ్. నిర్మలాకాశంపై పఱచుకున్న ఉషాకిరణాలు అతడి హృదయంలో ఆశాకిర ణాలై భాసిల్లాయి.

సుభాష్ ఉదయం నిద్రలేచేసరికి ప్రక్కపై కిరణ్ లేడు. కంటికి వరుసగా కన్పించేట్టు ఒక కవరుమాత్రం వుంది. ఆత్రంగా విప్పిచూచాడు.

"డియర్ సుభాష్."

కొన్ని విషయాలు మాట్లాడాలనుకున్నాను కాని, ముఖాముఖి చెప్పలేక ఈ విధంగా వ్రాయవలసి వచ్చింది.

మీది కొంచం సనాతనకుటుంబం. అందువల్ల నేను వెల్ల డించబోయే అభిప్రాయాలు మీకు బాధగా కోపంగా వుంటే మాత్రం మనస్ఫూర్తిగా క్షమించి మర్చిపోండి.

"నవవధువును చేపట్టే అర్హత నాకు లేదు, కాని మోడును చిగురింప జేయగలశక్తి వుంది. మోడువారిన వృక్షాన్ని చూచీ, బీడుగా మారిన నేలను చూచీ సంతోషించేవారికంటె, ఆ మోడు చిగురించి ఫలపుష్ప భరితమైనప్పుడూ, ఆ బీడు సస్యశ్యామలంగా మారి కనులపండువుచేసినప్పుడూ ఆనందించేవారే ఎక్కువనుకుంటాను. అందులో తప్పులేదు, పైగా అంతా మంచే యిమిడివున్నది.

తనవారినందర్నీ యుద్ధంలో మట్టు పెట్టించి కృష్ణుని వరించిన రుక్మిణీ కళ్యాణాన్ని కళ్ళకద్దుకొనే భక్తులూ, దమయంతీ స్వయంవరమూ, సీతాకళ్యాణమూ విని పులకించిపోయే వృద్ధులే, నేటి స్వయంవరాలను హేళన చేస్తారు.

భారతంలో సత్యవతీ కుంతీలను హర్షించి మరీ మరీ పారాయణ చేసే వ్యక్తులే నేటి నియమబద్ధమైన పునర్వివాహాలనూ విమర్శిస్తారు. చాతుర్వర్ణములలో వివాహమాడిన వారి చరిత్రలనూ పురాణాలనూ గానం చేసేవారే వర్ణాంతర వివాహాలను ద్వేషిస్తున్నారు.

అందువల్ల నేను నిశ్చయించుకున్న దేమంటే ఆశాలతకు నేను అన్నివిధాలా తగిన వరుడినని. ఇందుకు మీ

బావగార్ని ఒప్పించే పూచీ నీది. అసాధ్యమైతే మనం చేయ గలిగిందిలేదు. ఈ విధంగా మనబంధుత్వం కలిసినా కలియక పోయినా సహృదయులైన మీ కుటుంబంవారి స్నేహం రెండురోజులే అయినా, మర్చిపోను చి॥ సౌ॥ ఉషారాణికి యోగ్యుడయిన వరుడిని వెదకి తెచ్చేబాధ్యత నాదని, అంత వరకూ ఆమెను ఎవరికో ఒకరికి చేసెయ్యాలనే తలంపు మానుకోవలసినదనీ నా అభ్యర్థనగా మీ బావగారితో చెప్పగలవు. వారికి నమస్కారములు.

—కిరణ్."

మాఘమాసాంతములో ఆశాలతా కిరణ్‌ల వివాహం తిరుచానూరులో జరిగింది. గ్రీష్మమే గాని వసంత మెరుగని ఆశ జీవితంలో నవవసంతం ప్రవేశించింది. శూన్యమయిన తిమిరబంధురమయిన కిరణ్‌కుమార్ మదిలో ఆశాభావాలు చిగురించి. వినూత్నోత్సాహం పొంగిపొరలింది ఉషనేత్రా లలో వేయి జ్యోత్స్నల వెలుగులు నిండాయి. తలిదండ్రుల మానసాలు శోకదూరమై, వేదనా రహితమై నిర్మలానం దంతో నిండాయి!

"ఉషా!" కళ్యాణవేదిక దిగివచ్చిన ఆశ చెల్లెల్ని కౌగలించుకొంది.

"నువ్వూ మీ బావగారూ నా జీవితానికే కాదు— నాబోటి అభాగ్య స్త్రీల శోకాంధతిమిర జీవితాలకే ఆశా కిరణాలు దైవం మిమ్మల్ని చల్లగా చూస్తా"

ఆశాలతా ద్వితీయుడై తన స్వస్థలానికి వెళ్తున్న కిరణ్‌తో ఉష, "అక్కయ్య మీ అంత తెలివైనది కాదు బావగారూ; భద్రం," అంది ఆనందబాష్పాలతో హాస్యం-జోడించి.

ఒక్కక్షణం ఆమెను చూచి మందహాసం చేశాడు కిరణ్.

"నాతో పరిచయమున్న ఎవరూ చెడుగా ఉండలేరు కిరణ్.

"కనీసం ఊహించనయినా ఊహించలేరని నా నమ్మిక ఉషా."

"కార్యదీక్షా, ధైర్యమూ, సంస్కారమూ గల నీ జోటి వ్యక్తులే సంఘానికి ఆశాకిరణాలు.

"అవును ఉషా." సుభాష్ దరహాసవదనంతో అన్నాడు. "ఉషా హృదయ కిరణజన్యమై ఆశాకిరణాల సంయోగంగా రూపొందిన ఈ ఆశాకిరణం సంఘానికే ఆశా కిరణమై భాసిల్లగలదు."